క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత



పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తున్న చేస్తున్న నగర సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్ స్టేషన్ భవన మరమ్మతు పనులు పూర్తవడంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం దాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోలీస్ స్టేషన్ భవనం వర్షాలకు కారుతూ, కార్యాలయంలో ఉన్న ఫైళ్లు తడిసిపోతున్నాయని తెలుసుకుని పోలీస్ వెల్ఫేర్ సంక్షేమ నిధి నుంచి రూ. 2 లక్షలు కేటాయించి మరమ్మతులు చేయించినట్లు కమిషనర్ తెలిపారు. భవనం ప్రారంభం అనంతరం, పోలీస్ కమిషనర్ సిబ్బందితో సమావేశమయ్యారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీ-2 మేరీ ప్రశాంతి, హార్బర్ ఏసీపీ కాళిదాస్, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు 14న రక్తదానం



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకై ఈనెల 14న రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం గోడపత్రికను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన ఏడుసార్లు రక్తదానం చేసి స్టీల్ సమస్యలను ప్రభు త్వం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా 1600 రోజులుగా ఐక్య పోరాటాలు చేస్తున్నామన్నారు. కాని ప్రభు త్వం ప్యాకేజీ ప్రకటించి కార్మికుల జీవితాలను, ప్లాంట్ భవిష్యత్తును మరింత సంక్షోభంలోకి నెట్టే విధంగా చర్యలు చేపడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక వర్గం మరింత ఐక్యంగా తమ రక్తా న్ని దానం చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకులు బి. అప్పారావు మాట్లాడుతూ ప్రపంచ రక్తదాన దినో త్సవం సందర్భంగా జూన్ 14న అంబేడ్కర్ కళాక్షేత్రంలో శిబిరం నిర్వహిస్తున్నామన్నా రు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ నాయకు లు పి. శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పూర్ణచంద్రరావు, కె. శ్రీనివాస్, కొయిలాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లిన బస్సు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

పెదగంట్యాడ: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన జీవీఎంసీ 64వ వార్డు యారాడ పరిధిలోని కొండ ఆర్చి సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజూ మాదిరిగానే బస్సు నెంబర్-16 మల్కాపురం మార్గంలో నుంచి యారాడ గ్రామానికి వెళ్లింది. అయితే రాత్రి సమయం కావడంతో మలుపు తిప్పే సమయంలో అదుపుతప్పడంతో పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ఘటనలో సిబ్బందితో పాటు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

భక్తిశ్రద్ధలతో పూజలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 11వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ తెలిపింది. స్వామి వారి దివ్య తిరు కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అలాగే 11నపుష్పాంజలి, పవళింపుసేవ ఉంటుందని ధర్మకర్త ఈకే చారి తెలిపారు.



ఫుట్‌పాత్‌ను ఆక్రమించేసిన దుకాణదారులు



తాటిపూడి పైప్‌లైన్ స్థలంలో వెలసిన చికెన్ దుకాణం



దుకాణం వద్ద కుచించుకు పోతున్న సర్వీస్ రహదారి

పైప్‌లైన్‌పై దుకాణాలు!



గోపాలపట్నం బంక్ సెంటర్‌లో తాటిపూడి పైప్‌లైన్‌పై వెలసిన దుకాణాలు

గోపాలపట్నం పెట్రోల్ బంక్ సెంటర్ వద్ద తాటిపూడి పైప్‌లైన్‌పై దుకాణాలు ప్రజల పాలిట శాపంగా తయారవుతున్నాయి. పైప్‌లైన్ మీదే దుకాణాలు ఉండం వల్ల ఒత్తిడికి ఎక్కడికక్కడ లీకవుతూ మంచినీరు వృథా అవుతోంది. ఒక్కో సారి భారీ పేలుడు సంభవించి స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. లీకయ్యే సమయంలో మంచినీరు కలుషితమవుతోందని ప్రజలు వాపోతున్నారు.
- గోపాలపట్నం

- వీటి ఒత్తిడి వల్లే లీకేజీలు, భారీ పేలుళ్లు
- తాటిపూడి పైప్‌లైన్ మరమ్మతులకే లక్షల్లో ఖర్చు
- 400 గజాలు కూడా ఆక్రమణ
- రోడ్లు సైతం అద్దెకు..
- చోద్యం చూస్తున్న అధికారులు



గోపాలపట్నం రైతు బజారులో తాటిపూడి లీకవుతున్న పైప్‌లైన్ (ఫైల్)

తాటిపూడి పైప్‌లైన్ వేసేందుకు సుమారు 1985 ప్రాంతంలో స్థల సేకరణ చేసింది. ఇక్కడ నివాసమున్న సుమారు 74 మందికి పద్మనాభనగర్ సమీపంలోని బంటాకాలనీ వద్ద ఇంటి స్థలాలు కేటాయించారు. అయినా ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. కొంత మంది స్థలాలను అమ్ముకున్నారు. ఈ దుకాణాలకు ఆనుకుని వెనుక భాగంలో సుమారు 400 గజాల స్థలంలో భారీ చికెన్ దుకాణం నిర్మించారని ఆరోపిస్తున్నారు. దీనిపై తగిన చర్యలు తీసకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడాదికోసారి బ్లాస్ట్

ఏడాది కోసారి పైప్‌లైన్ బ్లాస్ట్ అవడం ఆనవాయితీగా మారింది. అధికారులు పైప్‌లైన్ లీకవుతున్నప్పుడు తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆక్రమణల జోలికి వెళ్లకపోవడం అనుమానాలకు తావిస్తోంది. దుకాణాలు ఏర్పాటు చేయడమే కాకుండా టాయిలెట్లు నిర్మించి వినియోగిస్తున్నారు. లీకయ్యే సమయంలో వ్యర్థాలు కలిసి నీరు కలుషితమవుతోందని వాపోతున్నారు.

నిర్వహణకు రూ. 33 లక్షలు

ఏడాదికి రూ.33 లక్షలు ఇక్కడ పైప్‌లైన్ నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు. అదే ఆక్రమణలు తొలగిస్తే పైప్‌లైన్ లీకేజీ, బ్లాస్ట్ వంటి ఘటనలు ఉత్పన్నం కాదని.. తద్వారా ప్రజా ధనం ఆదా అవుతుందని చెబుతున్నారు. అలాగే ప్రభుత్వం సేకరించిన స్థలంలో ప్రజావసరాలకు ఉపయోగపడే వాటికి వినియోగించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాలు అద్దెకి...

దుకాణదారులు రహదారులను సైతం అద్దెకి ఇచ్చేస్తున్నారు. రెండుచేతులా ఆర్జిస్తున్నారు. వారి దుకాణం ముందు తోపుడు బవడి పెట్టినా పానీపూరి బండి పెట్టినా దుకాణదారుడికి అద్దె చెల్లించాల్సిందే. రోజుకు రూ.200 ఉంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. దుకాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లు సైతం



ఫుట్‌పాత్‌ల పైనే టిఫిన్ దుకాణాల నిర్వహణ



గోపాలపట్నం రైతు బజారు వద్ద స్క్రాప్ బస్తాలు

ఇక్కడి దుకాణదారులు ఫుట్‌పాత్‌లు కూడా వదలడం లేదు. పాదచారులు నడిచేందుకు కూడా అవకాశమివ్వడం లేదు. మాంసం దుకాణాలు, కాయగూరల వ్యాపారాలతో ఫుట్‌పాత్‌లో నడిచేందుకు అవకాశం లేకుండా చేసేశారు. అధికారులు సైతం చోద్యం చూస్తుననట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి కొబ్బరి బొండాల వ్యాపారులు, స్క్రాప్ దుకాణం వారు సామగ్రి వేసి పరిసరాలను సైతం పాడు చేస్తున్నారు. ఓ స్క్రాప్ దుకాణదారుడు రైతు బజారుసమీపంలోని గెడ్డ స్థలంలో స్క్రాప్ వస్తులు పేర్చుకుంటూ పోతున్నాడు. ఇక్కడ పెట్టవద్దంటే దౌర్జన్యానికి దిగుతున్నాడని రైతు బజారు అధికారులు వాపోతున్నారు.

ఎల్జీ పాలిమర్స్ ప్రతినిధులకు నిరసన సెగ

- సర్వే పేరుతో వచ్చిన వారిని అడ్డుకున్న స్థానికులు

గోపాలపట్నం: ఎల్‌జీ పాలిమర్స్ ప్రతినిధులకు స్థానికుల నుంచి నిరసన సెగ తగిలింది. సర్వే పేరుతో జీవీఎంసీ 92వ వార్డు ఎస్సీబీసీ కాలనీకి వచ్చిన ప్రతినిధులను స్థానికులు అడ్డుకున్నారు. సీఎస్ఆర్ నిధులతో స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించేందుకు వచ్చామని దానిపై మీకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం చోటు చేసుకున్న తర్వాత ఇన్నాళ్లకు మా మీద ప్రేమ కలిగిందా అంటూ నిలదీశారు. మీ ప్రయోజనాల కోసం మాత్రమే వచ్చారు. మాపై ప్రేమతో వచ్చారా అంటూ ఎండగట్టారు. గోపాలపట్నం ప్రైవేటు ఆస్పత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసే సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఈ గ్రామంలో ఎటువంటి సర్వేలు చేయవద్దని గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఎల్‌జీ పాలిమర్స్ ప్రతినిధులు చిట్టిబాబు, కోరియా ప్రతినిధి జాంగ్, రాజేంద్ర స్థానికులతో చర్చించేందుకు వచ్చారు. అయితే స్థానికులు వ్యతిరేకించడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఇటీవల నిర్వహించిన వైద్య శిబిరానికి కూడా వెంకటాపురం పరిసర ప్రాంతాల వారికి సమాచారమివ్వలేదని వాపోతున్నారు.

ఏపీ పోర్టల్ సేవలు నిలుపుదల

విశాఖ విద్య: గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఏపీ పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు ఏపీ సేవా పోర్టల్‌లో సాంకేతికపరమైన మార్పుల నేపథ్యంలో సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆదాయ ధ్రువపత్రం, సమగ్ర ధ్రువపత్రం, భూమి మ్యుటేషన్లు, రేషన్/రైస్ కార్డులు, ఇళ్లపట్టాలు, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ, వాటర్ టాక్స్, పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలు నిలిచిపోనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఈ నెల 10వ తేదీ రాత్రి వరకు పోర్టల్ అందించే సేవలు నిలిచిపోతాయని.. ప్రజలు గమనించి, సహకరించాలన్నారు.

ప్రశాంతంగా తొలిరోజు డీఎస్సీ పరీక్ష



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



తనిఖీ చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: డీఎస్సీ పరీక్షలు ప్రశాతంగా ప్రారంభమయ్యాయి. ఎస్‌వీడీ సెంటర్ బుచ్చిరాజుపాలెం ఏడీజెడ్ ఆరోవనా డిజిటల్ జోన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం జరిగిన పరీక్షకు 450 మంది నమోదు చేసుకోగా, వీరిలో 409 మంది హాజరయ్యారు. అదే విధంగా మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 312 మందికి గాను 246 మంది హాజరయ్యారు. కేంద్రం వద్ద అభ్యర్థులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన అనంతరం లోపలికి పంపించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎంఈవో దివాకర్ తెలిపారు.

శాస్త్రోక్తంగా విగ్రహాల ప్రతిష్టాపన



దాతలతో కలసి వేడుకలో పాల్గొన్న శ్రీధర్



కొలువుదీరిన మల్లికార్జున స్వామి

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ కాలనీలో నూతనంగా నిర్మించిన లలితా సుబ్రహ్మణ్యేశ్వర సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, లలితా త్రిపుర సుందరి, మల్లికార్జున స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ట ఆలయ నిర్మాణ దాతలు మండవ రవికుమార్, వాణి దంపతులతో పాటు కొమ్మారెడ్డి సదాశివరావు త్రిపుర, మండవ ప్రణీత్, సాయి హర్షిత దంపతులచే నిత్యార్చనలు, విశేషహోమాలు, యంత్రప్రతిష్టలు, ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం,పూర్ణాహుతి, దర్పణ దర్శనం, సర్వ దర్శనం, శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, లలితా త్రిపుర సుందరి, మల్లికార్జున స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్టించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే గణబాబు, నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద మహా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో వుడా లేఅవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మందలపు వాసుదేవరావు, కార్యదర్శి సీహెచ్ వి.సురేష్, కోశాధికారి కనకారావు, వి.వి.సూర్యనారాయణ, సూర్యనారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న జోన్- 5 కమిషనర్ రాము

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లో శుక్రవారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. జోన్-5 కమిషనర్ బి.రాము మాట్లాడుతూ చుట్టు పక్కల ప్రదేశాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.డెంగ్యూ,మలేరియా తదితర సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంట్లో తినే పదార్థాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచరాదన్నారు. రబ్బరు టైర్లు,నీటి తొట్టెల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటితో పాటు మన ఇంటి పరసర ప్రాంతాలు శుభ్రంగా ఉన్న రోజు ఎలాంటి రోగాలు దరిచేరవన్నారు.నిషేధిత ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పి ,పేపర్ లేదా గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలన్నారు. మలేరియా అధికారి డి.రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమేష్,నవరత్నం,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధం



యోగా సాధన చేస్తున్న ధ్యానులు

అగనంపూడి: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధమని గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి అన్నారు. అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ (దివ్య జ్యోతి భవనం) ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవ సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనిలో అంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ గుడివాడ సుధారాణి, విశాఖ బ్రహ్మకుమారీస్ కోఆర్డినేటర్ బీకే సోమేశ్వరి, అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, బొండా ఈశ్వరరావు, గంతకోరు సత్యవతి, కోట, నరసింహమూర్తి, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో వికాసం



ముగింపు వేడుకల్లో విద్యార్థులతో అతిథులు

మల్కాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో మల్కాపురం శాఖా గ్రంథాలయం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. గ్రంథాల సిబ్బందితో పాటు పాఠకులు, పెద్దలను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా 40 రోజుల నుంచి నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఎస్‌ఏ అధికారి ఇ.పి.ఎస్.బాగ్యలక్ష్మి, నాయకులు మజ్జి సోమేష్, బి.సత్యానందం, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వం.. శ్రీనివాస మయం

వైభవంగా వెంకన్న కల్యాణం



సూర్యప్రభ వాహన సేవలో తిరుమలేశుడు



శ్రీనివాసుని కల్యాణం తిలకిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణం తిరుపతిని తలపించింది. భక్తుల గోవింద నామస్మరణతో ప్రాంగణం అంతా మార్మోగింది. ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్య క్షేత్రంలోని శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిపారవశ్యంతో నిర్వహిస్తున్నారు. దివ్యక్షేత్రం చైర్మన్ గుత్తికొండ బాలాజీ ఆధ్వర్యంలో ఈ నెల 3న ప్రారంభించిన ఉత్సవాలు 7వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. శుక్రవారం వేకువజాము నుంచి తిరుమలేశునికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. మూలమూర్తికి అభిషేకం, శ్రీవారి అలంకరణ, నిత్య అర్చన అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. ఉదయం తిరుమలేశుడు సూర్యప్రభవాహనంలో ఊరేగారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, స్వామి వారి మూల మంత్ర హోమం, బలిహరణ అనంతరం ముత్యాల పందిరి వాహనంలో మాడవీధుల్లో ఊరేగారు.

కనుల పండువగా ద్వితీయ వార్షిక కల్యాణం

ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి పద్మావతి శ్రీనివాసుల కల్యాణం అంగరంగ వైభవంగా సాగింది. వందలాది మంది భక్తులు తిరుమలేశుడి కల్యాణాన్ని కనులారా తిలకించి పునీతులయ్యారు. మాంగల్యా ధారణ ముందు రుత్వికులు పుస్తెలను భక్తులకు చూపుతూ అనంతరం పద్మావతి అమ్మవారికి మాంగల్యాధారణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ సమయంలో పూర్తిగా గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది.